క్లుప్తంగా

కొనసాగుతున్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు



విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పేదలకిచ్చిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సెలవు రోజైన శనివారం కూడా కొనసాగాయి. విజయవాడ రూరల్ మండలంలోని 32 సచివాలయాల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు ప్రభుత్వ ఆదేశాల మేరకు జరిగాయి. రిజిస్ట్రేషన్ల నిర్వహణపై విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ పి.జాహ్నవి, ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య సచివాలయాల్లో పర్యటించి పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు 4 వేల ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్లు చేశామని తహసీల్దార్ పి.జాహ్నవి తెలిపారు. ఆదివారం కూడా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరుగనున్నాయి.

జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఆర్వో ప్లాంట్ బహూకరణ



పెనమలూరు: కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆర్వో వాటర్ ప్లాంట్‌ను దాత బహూకరించారు. పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో విజయవాడకు చెందిన వీర్‌బ్యాక్ యానిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ రాజు రూ.50 వేలు విలువ చేసే 50 లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. దాతను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పెద్దు విజయలక్ష్మి, పాఠశాల కన్వీనర్ అన్నే శివనాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో సురక్షిత తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మాణమైన వాటర్ ట్యాంకులను శనివారం పరిశీలించారు.

ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. గ్రామంలోని 24కె కల్యాణ మండపం వద్ద 1.20 లక్షల లీటర్లు, బీసీ శ్మశానవాటిక వద్ద 60 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకుల నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. వీటికి పైప్‌లైన్ పనులు కూడా పూర్తయ్యాయని, అతి త్వరలో ఈ ట్యాంకులను ప్రారంభించి గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. విజ్ఞాన విహార్ పాఠశాల సమీపంలో 2.40 లక్షల లీటర్ల వాటర్ ట్యాంకు నిర్మాణానికి, గ్రామంలో 3 కిలోమీటర్ల విస్తీర్ణంలో వాటర్ పైప్‌లైన్ విస్తరణ పనులు టెండర్ దశలో ఉన్నాయన్నారు. గ్రామంలో ప్రస్తుతం 22 మోటారు బోర్లు, వాటర్ ట్యాంక్ సహాయంతో తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐలు

కంకిపాడు: కంకిపాడు పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా డి.సందీప్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన కె.సుధాకర్ తూర్పుగోదావరి జిల్లాకు బదిలీ కావటంతో ఆయన స్థానంలో కూచిపూడి ఎస్‌ఐగా పని చేస్తున్న సందీప్‌ను ఉన్నతాధికారులు కంకిపాడుకు బదిలీ చేశారు. దీంతో ఆయన స్థానిక పీఎస్‌లో బాధ్యతలు స్వీకరించారు. సీఐ వి.శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ – 2గా ఆర్జామ్మ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ – 2గా పి.ఆర్జామ్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఎస్‌ఐ-2గా పని చేస్తున్న తిరుమలరావు స్థానంలో కాకినాడ నుంచి బదిలీపై ఆమె ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహ మూర్తిని మర్యాద పూర్వకంగా కలిశారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్‌ఐ ఆర్జామ్మ తెలిపారు.

జగనన్నకు బాసటగా నిలుద్దాం

- రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్
- కోలవెన్నులో డాక్టర్ వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ



కోలవెన్నులో లబ్ధిదారులకు వైఎస్సార్ ఆసరా చెక్కులు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

కంకిపాడు: ప్రజలకు సంక్షేమ పాలన అందజేస్తున్న సీఎం జగనన్నకు అన్ని వర్గాలూ బాసటగా నిలవాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ పిలుపునిచ్చారు. డాక్టర్ వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ మహోత్సవం కోలవెన్ను జెడ్పీ పాఠశాలలో శనివారం నిర్వహించారు. కోలవెన్ను, కుందేరు, నెప్పల్లి, గొల్లగూడెం, దావులూరు, చలివేంద్రపాలెం, క్రిస్టియన్‌పేట, జగన్నాథపురం, పునాదిపాడు గ్రామాల పరిధిలోని 380 పొదుపు సంఘాలకు చెందిన 3,802 మంది డ్వాక్రా సభ్యులకు రూ.3.31 కోట్ల ఆసరా సొమ్ము విడుదల కావటంతో లబ్ధిదారులకు మంత్రి జోగి రమేష్ చెక్కులు పంపిణీ చేశారు. తొలుత మహానేత వైఎస్సార్ విగ్రహానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రగతి పథంలో పయనించాలి..

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఆర్థిక సంక్షోభం ప్రభుత్వాన్ని కుదిపేసినా ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పాలన అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం రుణాలను మాఫీ చేస్తున్నారని చెప్పారు. రుణ పరపతి పెంచి పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకుని కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల పురోగతి, విద్యార్థులు, యువత ప్రగతికి అన్ని చర్యలనూ సీఎం జగన్ తీసుకుంటున్నారన్నారు. వసతులను సద్వినియోగం చేసుకుంటూ ఆయా రంగాల ప్రజలు ప్రగతి పథంలో పయనించాలని కోరారు.

ప్రతిపక్షాల కుట్రలను భగ్నం చేయండి..

రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతిపక్షాలు విమర్శించడం సరికాదని మంత్రి జోగి రమేష్ అన్నారు. ప్రజలు సంతోషంగా ఉంటే, అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అనుభవిస్తుంటే చూసి ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పాలనపై చంద్రబాబు, పవన్, లోకేష్‌లు మూకుమ్మడిగా దాడి చేస్తున్నారని విమర్శించారు. విష రాజకీయాలు చేస్తూ దొంగలు ఏకమై ఎన్నికలకు సిద్ధమవుతున్నారని, ప్రజలు వాస్తవాలను గుర్తించి ప్రతిపక్షాలకు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పని చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కెడిసిసి బ్యాంక్ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి, జెడ్పీటీసీ బాకీ బాబు, సర్పంచ్ సీహెచ్ సురేష్‌కుమార్, ఎంపీటీసీ తోకల ఉమాదేవి, ఉప సర్పంచ్ కంచర్ల వెంకటరావు, మాజీ సర్పంచ్ టెక్కెం సతీష్‌కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, కమ్మ, టిడ్కో, ఉమెన్ ఫైనాన్స్, నగర కార్పొరేషన్ డైరెక్టర్లు రామినేని రమాదేవి, రాఘవరావు, నందిపాటి బిందుమాధవి, నక్కా శ్రీనివాసరావు, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరి రాణి, నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా, ప్రజాప్రతినిధులు పి.శ్రీనివాసరావు, బాయిరెడ్డి నాగరాజు, బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి, నాయకులు పి.రామకోటేశ్వరరావు, కొండవీటి సుబ్బారావు, ప్రసాద్, పర్వతనేని సుభాష్, వెలుగు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన



ఉంగుటూరు: డిజిటల్ లావాదేవీలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరిబాబు తెలిపారు. ఎన్.ఎ పేటలో ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో డిజిటల్ లావాదేవీలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీహరిబాబు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా చూస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించి ఆన్‌లైన్ మోసాలకు అరికట్టేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఇంటింటికి వెళ్లి ఆన్‌లైన్ లావాదేవీలు, ఆన్‌లైన్‌లో కరెంటు బిల్లులు, నగదు పంపించడం వంటి లావాదేవీలను వివరించారు. ఆన్‌లైన్ మోసాలు జరిగిన వెంటనే సంబంధిత బ్యాంకులో, సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

అభివృద్ధి పనులకు రూ.1.21 కోట్లు కేటాయింపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రవి

గన్నవరం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు మండల పరిషత్ ద్వారా రూ.1.21 కోట్ల నిధులు కేటాయించినట్లు ఎంపీపీ అనగాని రవి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల అమలు తీరు, ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష చేపట్టారు. అనంతరం ఎంపీపీ రవి మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు గాను మండల పరిషత్ జనరల్ ఫండ్ రూ.86 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.35 లక్షలు కేటాయించారన్నారు. ఈ నిధులతో గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాలనీల్లో అంతర్గత రహదారుల అభివృద్ధి, సీసీ డ్రెయిన్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాల్లో మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించామన్నారు. జగనన్న కాలనీల్లో రహదారుల నిర్మాణం చేపడతున్నట్లు తెలిపారు. గడిచిన రెండున్నరేళ్లలో మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో పెద్ద ఎత్తున్న అభివృద్ధి పనులు చేశామన్నారు. జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ.గౌసాని, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారి, ఎంపీడీఓ ఈ.సత్యకుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి గ్రామ పంచాయతీ తీర్మానం



సమావేశంలో చర్చిస్తున్న సర్పంచ్ సరళ, సభ్యులు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో 35 లక్షల రూపాయల గ్రామ పంచాయతీ నిధులతో ఏడు సిమెంటు రోడ్ల నిర్మాణానికి నున్న గ్రామ పంచాయతీ తీర్మానం చేసింది. గ్రామ సర్పంచ్ కాటూరి సరళ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2024–25వ సంవత్సరానికి గాను పారిశుద్ధ్య కార్మికులు 54 మంది కాంట్రాక్ట్ విధానంలో పని చేసేందుకు సమావేశం తీర్మానం చేసింది. కాంట్రాక్ట్ కార్మికులకు రోజుకు 390 నుంచి 420 రూపాయలకు వేతనాలను పెంపుదల, వికాస్ కాలేజీ రోడ్డులో భారీ వాహనాలు రాకపోకలను నిషేధిస్తూ కోటకట్ట సెంటర్‌లో మెడికల్ షాపు వద్ద గడ్డర్లు ఏర్పాటు చేయడానికి సమావేశంలో తీర్మానం చేశారు. సమావేశంలో ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని, గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ, పలువురు పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి విషయంలో ఘర్షణ

పెనమలూరు: చోడవరం గ్రామంలో ఇంటి విషయమై కుటుంబంలో వివాదం జరిగి పరస్పర దాడులు చేసుకోవటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం ఐనంపూడి అమ్మాజీ గత ఐదేళ్లుగా తండ్రి చోడవరపు బుల్లెయ్యకు చెందిన ఇల్లు మరమ్మతులు చేసుకోని అందులో ఉంటుంది. అయితే ఆమె సోదరుడు మరియన్న, సోదరి మరిమమ్మ, ఆమె భర్త ప్రేమ్‌కుమార్ ఇంట్లో ఉండరాదని గొడవ పడి దాడి చేశారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కాగా మరియమ్మ ఫిర్యాదు చేస్తూ తన సోదరి అమ్మాజీ తనను ఇంటి విషయమై దాడి చేసిందని ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు.

మహిళపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: కానూరులో మహిళపై ముగ్గురు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కానూరుకు చెందిన లంకపల్లి దేవి తన ఇంటి సమీపంలో ఖాళీ స్థలంలో శుక్రవారం గేదెలు మేపుతుండగా అదే గ్రామానికి చెందిన కాటూరి వెంకటరమణ, ఆమె కుమారుడు బ్రహ్మజీ, మరో వ్యక్తి వచ్చి ఇక్కడ గేదెలను గడ్డి ఎందుకు మేపుతున్నావని గొడవ పడ్డారు. ముగ్గురు వ్యక్తులు ఆమెపై దాడి చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు ఖురాన్ కంఠస్థ పోటీలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ఆటోనగర్‌లోని ది ఆటోమొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం 9వ రాష్ట్ర స్థాయి బాల, బాలికల ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ చైర్మన్ మొహ్మద్ దావూద్, సిటీ ఇన్‌చార్జి షేక్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు ఇస్తామన్నారు. ఈ పోటీల్లో మూడు నుంచి 12 ఏళ్లలోపు బాల బాలికలు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల ప్రత్యేక కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్ ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు అందిస్తారని పేర్కొన్నారు.

అగ్గిపుల్ల సాయి నగర బహిష్కరణ పొడిగింపు

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన పోలవరపు సాయికుమార్ అలియాస్ అగ్గిపుల్ల సాయి నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. టుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపేటకు చెందిన అగ్గిపుల్ల సాయి గతంలో అనేక నేరాలకు పాల్పడి జైలు జీవితం అనుభవించినా అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో నగరం నుంచి బహిష్కరించామని పేర్కొన్నారు. నగర బహిష్కరణ జరిగినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదని తెలిపారు. నగరంలోకి ప్రవేశిస్తే అల్లర్లు సృష్టించి ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు సమాయత్తమవుతున్నాడనే నిఘా వర్గాల సమాచారంతో బహిష్కరణను పొడిగించినట్లు స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న, చెడు నడత కలిగిన వ్యక్తులను ఉపేక్షించకుండా నగరం నుంచి బహిష్కరిస్తామని సీపీ హెచ్చరించారు.

మత్తు పదార్థాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత



కానూరులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న జమాత్ ఇస్లామీ ప్రతినిధులు

పెనమలూరు: మత్తు పదార్థాల నిర్మూలనను ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా నిర్వహించాలని జమాత్ ఇస్లామీ నార్త్ అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్ సూచించారు. కానూరు సనత్‌నగర్‌లో శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం 296 మిలియన్ల ప్రజలు మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారారని తెలిపారు. వీరిలో 35 బిలియన్ల మంది రుగ్మతలతో బాధపడుతున్నారన్నారు. భారతదేశంలో 14.6 కోట్ల మంది ఆల్కహాల్ దురలవాటుకు లోనై అయ్యారని తెలిపారు. కొన్ని సందర్భాల్లో హెచ్‌ఐవీ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. విజయవాడ నగర అధ్యక్షుడు ఖలీలుల్లాహ్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలతో యువత భవిష్యత్ అంధకారంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సంస్థ ద్వారా ప్రజలు, యువతలో చైతన్యం తీసుకువచ్చి మత్తు పదార్థాల నివారణకు విస్తృత ప్రచారం చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో అన్ని విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. జమాత్ ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ వరకు విస్తృత ప్రచారం చేపడతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత సిద్దిక్, సంస్థ సభ్యులు లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పీవీ, స్వామినాథన్‌కు భారతరత్న హర్షణీయం

గన్నవరం: మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు, హరిత విప్లవ పితామహుడు ఎంఎస్.స్వామినాథన్‌కు దేశంలోనే అత్యున్నత పురస్కారమైన భారతరత్న అవార్డులు ప్రకటించడం హర్షణీయమని మాజీ ఎమ్మెల్యే ముసునూరు రత్నబోస్ పేర్కొన్నారు.

ఈ మేరకు శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. బహుభాషా కోవిదుడైన పీవీ నరసింహారావు ప్రధానిగా దేశానికి అందించిన సేవలు మరువలేనివని చెప్పారు. ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథం వైపు పరుగులు పెట్టించారని కొనియాడారు. దేశ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనత స్వామినాథన్‌కు దక్కుతుందన్నారు. ఇటువంటి మహోన్నత వ్యక్తులను గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మాత్రం వీరికి భారతరత్న ఇచ్చి గౌరవించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

కానూరులో వివాదాస్పద భూమి పరిశీలన



కానూరులో ఆర్డీఓ రాజుతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

పెనమలూరు: కానూరులో వివాదంగా ఉన్న భూమిని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్‌ప్రసాద్ పరిశీలించారు. కానూరులోని ఆర్ఎస్ నంబర్ 123/4,123/6,125/2ఎ లోని 81 సెంట్ల భూమిని ఆయన శనివారం పరిశీలించారు. గ్రామంలోని 81 సెంట్ల భూమి తనదేనని, కొందరు తన భూమిని ఆక్రమించారని ఎస్సీ కమిషనర్‌కు పి.శ్రీనివాసరావు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్ భూమిని పరిశీలించేందుకు వచ్చారు. ఆర్డీఓ డి.రాజుతో భూమి విషయమై మాట్లాడారు. భూమి ఆక్రమణలకు గురైందని ఫిర్యాదు అందటంతో సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌బాబు అధికారులను ఆదేశించారు. భూమి సర్వే చేస్తామని రెవెన్యూ అధికారులు చైర్మన్‌కు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

నేటితో మహిళా ఉత్సవ్ ముగింపు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మహిళలు స్వయం ఉపాధి కోర్సులను నేర్చుకుని వస్తువులను ఉత్పత్తి చేసి విక్రయించడం ద్వారా ఆదాయం సంపాదిస్తూ కుటుంబ అవసరాలను తీర్చుకోవచ్చునని పారిశ్రామికవేత్త పి.పల్లవి చెప్పారు. స్థానిక మధు చౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాల్‌లో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మహిళా ఉత్సవ్-2024లో శనివారం సాయంత్రం మహిళలకు భాతిక్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ వస్త్రధారణ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 11 మంది పాల్గొన్నారు. మొదటి బహుమతిని బేబీ కేసవి తస్వికశ్రీ, ద్వితీయ బహుమతిని బి.రమణి గెలుపొందారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ విజేతలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. సీనియర్ రిసోర్స్ పర్సన్ పి.వరలక్ష్మి పోటీల న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. జనశిక్షణ సంస్థాన్ సిబ్బంది, స్టేక్ హోల్డర్స్ పాల్గొన్నారు. ఆదివారంతో మహిళా ఉత్సవ్ ముగిస్తుందని పూర్ణిమ చెప్పారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థుల్లోని సృజనాత్మకశక్తిని పెంపొందించుకుని వారిలోని నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు సైన్స్ ఎగ్జిబిషన్స్ ఎంతగానో దోహదం చేస్తాయని పిల్లల మానసిక వైద్య నిపుణుడు ఫణి ప్రసాద్ ముక్తేవి అన్నారు. సిద్ధార్థనగర్‌లోని లిటిల్ బ్రెయిన్స్ స్కూల్‌లో సైన్స్ ఎగ్జిబిషన్- 2024 శనివారం జరిగింది. విద్యార్థులు సబ్జెక్టు నేర్చుకోవడంతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జి పెంపొందించేందుకు సైన్సు ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వం. ఎందుకు .. ఏమిటి.. ఎలా అని ఆలోచించినప్పుడు వారి సమాధానాలకు జవాబు దొరుకుతుందన్నారు. నర్సరీ నుంచి 9వ తరగతి విద్యార్థులు వారి సబ్జెక్టు సంబంధించిన పలు అంశాలు చక్కగా రూపొందించి సుమారు 70 అంశాలను ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ సుధా ప్రవీణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఎగ్జిబిషన్‌లోని అంశాలను పరిశీలించారు.

రేపు ఇన్‌స్పైర్ పోటీలు

గుణదల(విజయవాడతూర్పు): విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ సైన్స్ ప్రాజెక్ట్ పోటీలు ఈ నెల 12వ తేదీ సోమవారం ఆంధ్ర లయోల కళాశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు డీవైఈఓ కుమార్ తెలిపారు. ఈ మేరకు లయోల కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ మెంబర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీన జిల్లా స్థాయి సైన్స్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి పాఠశాల విద్యార్థుల నుంచి ఇప్పటికే 143 ప్రాజెక్టులు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతారని చెప్పారు.

లయన్స్ క్లబ్‌కు పుట్టగుంట రూ.2 లక్షల విరాళం



లయన్స్ క్లబ్ ప్రతినిధులకు నగదు అందజేస్తున్న పుట్టగుంట సతీష్‌కుమార్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని లయన్స్‌క్లబ్ హాల్ ఆధునీకరణకు ప్రముఖ పారిశ్రామిక వేత్త పుట్టగుంట సతీష్‌కుమార్ రూ. 2 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని ఆయన ఫాం హౌస్‌లో లయన్స్ క్లబ్ ప్రతినిధులు నందిగం స్వామి, గూడపాటి రత్నశేఖర్, అట్లూరి శ్రీనివాసరావులకు శనివారం అందించారు. గతంలోనూ లయన్స్‌క్లబ్ హాల్‌లో హెల్త్ క్లబ్ ఏర్పాటుకు పుట్టగుంట రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. లయన్స్ క్లబ్ హాల్ ఆధునీకరణకు సహకరించిన పుట్టగుంటకు లయన్స్‌క్లబ్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకటన

ప్రకటన

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెనమలూరు డివిజన్

90105 77706 (ఉయ్యూరు)

99122 20539 (పెనమలూరు)

90102 10382 (గన్నవరం)

Office mail : sakshiads@gmail.com


నేడు ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం

కంకిపాడు: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కృష్ణాజిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం కంకిపాడులోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు మండవ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పీకా ఇమ్మానుయేలు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని పోలీసుస్టేషన్ రోడ్డులోని సంఘ కార్యాలయం నుంచి సంఘ ప్రతినిధులు ర్యాలీగా ఫంక్షన్ హాల్‌కు చేరుకుంటామన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై చర్చిస్తామన్నారు. కౌన్సిల్ సమావేశంలో భాగంగా విద్యా రంగం – పరిరక్షణ అంశంపై విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు ప్రసంగిస్తారన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

గన్నవరం: ఎస్టీయూ గన్నవరం శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మోత్రు ఆనంద్‌కుమార్, రేవల్ల ఆనంద్‌కుమార్ నియమితులయ్యారు. స్థానిక చింతపల్లి పాపారావు భవన్‌లో శనివారం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షులుగా వీజేజే వెంకన్నకుమార్, కార్యదర్శి చిమట కృష్ణారావు, మహిళా కార్యదర్శి పెనుమూడి రమణదేవి, సీపీఎస్ కన్వీనర్ దోవరి సురేష్ ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా దేవరపల్లి విద్యాసాగర్, బొక్కినాల శ్రీధర్, కృష్ణారావు, సురేష్ నియమితులయ్యారు. ఎన్నికల అధికారిగా జాల మోహన్‌గాంధీ వ్యవహరించారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట



గొడవర్రులో ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న సర్పంచ్ విజయ చంద్రశేఖర్

కంకిపాడు: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని గొడవర్రు సర్పంచ్ మేరుగు విజయ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని గొడవర్రు గ్రామంలో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఆరోగ్య శ్రీ కార్డులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందేలా సీఎం వైఎస్ జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో నాడు – నేడు పథకం ద్వారా వసతులు మెరుగుపర్చారన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా రూ.25 లక్షల వరకూ వైద్యసహాయం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇందుకు గానూ ప్రజలకు ఆరోగ్య శ్రీ కార్డులను అందిస్తోందని చెప్పారు. ప్రభుత్వం అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

ఎన్.టి.ఆర్. జిల్లా, విజయవాడ గుణదల, సబ్‌రిజిష్ట్రారు వారి యిలాకా, విజయవాడ రూరల్ మండలం, నిడమానూరు, డోరు నెం.7-2రు కాపురస్తులు శీద్రాల సీతారామయ్య గారి కుమారుడు శీద్రాల వీరయ్య అను నేను వ్రాయించి ఇచ్చిన అఫిడవిట్.

నా భార్య శీద్రాల మహాలక్ష్మి ఆమె స్త్రీ ధనపు సొమ్ముతో ది 13-2-1998వ తేదిన సంకురాత్రిపాటి అనసూర్యమ్మ వగైరా గారల వలన క్రయమును పొంది శ్రీ గుణదల సబ్ రిజిష్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకము, దస్తావేజు నెం. 240/1998 రుగా రిజిష్టరు కాబడిన క్రయ దస్తావేజు రీత్యా నిడమానూరు గ్రామ ఆర్.సర్వే నెం. 164/1రు దాఖలా చ॥గ॥ 67.5లు ఆస్తి యందు వారికి సర్వహక్కులు కలిగి వారు స్వేచ్ఛగా అనుభవించుచూ యింటెస్టేట్‌గా ది. 8-2-2024వ తేదిన స్వర్గస్తులైనారు. ఆ తదాది సదరు ఆస్తిని విక్రయించదలచిగా క్రయదారాలు సదరు ఆస్తికి సంబంధించిన అన్ని దస్తావేజులను అనగా దస్తావేజు నెం. 240/1998రు. మరియు నెం.5097/1984గాగల ఫోటోస్టాట్ కాపీలను ఇవ్వవలసినదిగా కోరియున్నారు. అయితే నా వద్ద నా భార్య క్రయం పొందిన నెం. 240/1998రుగా గల క్రయ దస్తావేజు ఫోటోస్టాట్ కాపీ ఉన్నప్పటికి దాని లింకు దస్తావేజు నెం. 5097/1984రు గా గల హక్కు విడుదల దస్తావేజు ఫోటోస్టాట్ లేనందున ఫోటోస్టాట్ తీయించుటకు నేను ఫోటోస్టాట్ సెంటర్‌కు వెళ్ళగా నిడమానూరు సెంటరు పరిసరాలలో సదరు ఆస్తికి సంబంధించిన లింకు నెం. 5097/1984రుగా గల హక్కు విడుదల దస్తావేజు ఒరిజినల్ ఉన్న బ్యాగు పోయినది. సదరు లింకు దస్తావేజు నెం. 5097/1984 రుగా గల హక్కువిడుదల దస్తావేజు కొరకు నేను వెతకగా కనిపించలేదు. సదరు ఆస్తి యొక్క లింకు దస్తావేజు పోయినది. ఎంత వెతికినను కనిపించలేదు. సదరు ఆస్తి యొక్క లింకు దస్తావేజు నెం. 5097/1984రుగా గల దస్తావేజును దుర్వినియోగం చేయలేదు అని ఇందుమూలముగా తెలియజేయుచున్నాను.